# జనరేషన్!

(సత్యం శంకరమంచి అమరావతి కథలలోని ఆఖరు కథ ''మహా రుద్రాభిషేకం'' పేరడీగా)

## క్యూలో నుంచో తండ్రీ!

పంచదార వచ్చింది, పామాలిన్ వచ్చింది, గోధుమపిండి వచ్చింది! కిర్సనాయిలూ వచ్చింది! సంతత ధారగా సంచిలో వేసుకుపోదూగాని. నిలబడు తండ్రీ! నిలబడి 'అమరావతి' ముందుకు సాగు నా తండ్రీ!

హరహర మహాదేవ!
నరహర మహాదేవ

అల్లః ఆ నల్లటి డ్రమ్ముల్లోంచి వరుగు వరుగున వచ్చిందయ్యా కిర్సనాయిలు!

బొంబాయి లోయలో జాలుగా జారుతూ
గట్టు పుట్టల గనాటు గబగబా దూకుతూ
ఝుణ ఝుణా
ఫెళ ఫెళా
గల గలా
సరసరా

ఉరుకులతో వరుగులతో తరలివచ్చిందయ్యా కిర్సనాయిలు!

క్యూలో నించో తండ్రీ!
డబ్బాలు సరిచూడు తండ్రీ!
ఓ హరుడా!
ఓ నరుడా!

అన్ని చౌక డిపోలకూ అవినీతిలా పెరిగిందయ్యా క్యూ.

నిన్న ఆఫీసులో ఏం నిద్రపోయావో! ఏ పీడకల వచ్చిందో! జీతమెంత జీర్ణమయిందో! రా తండ్రీ! రా! వచ్చి క్యూలో నిలబడు.

అప్పుడే షాపుకి ఆ వొడ్డున ఆడంగులు క్యూలు చేస్తున్నారు. మొగవాళ్ళు దూరాలకు వెళ్ళి దమ్ములు కొడ్తున్నారు. పిల్లలు డబ్బాల మీంచి ఎగిరెగిరి దూకుతున్నారు.

కొత్తగా కాపురాని కొచ్చిన వైదేహి యింకా రాలేదు. "అత్తగారు క్యూకో కొచ్చి అరగంట దాటిందే! వైదేహి యింకా రాలేదేమో!" అని ఎదురు చూస్తున్న రాధకి గబగబా తొట్రుపడుతూ వస్తున్న వైదేహి కన్పించింది. వైదేహి సరాసరి బారెడు లైనులో స్థానం కాస్తున్న రాధ దగ్గరకెళ్ళింది.

"ఇంతాలశ్యం అయిందేం?" అంది రాధ.




"ఇంటి పని" అంది వైదేహి.

రాధ సూటిగా వైదేహి ముఖంలోకి చూసింది. "మీ అత్తగారు బయటకొచ్చాక మీ ఆయన యిప్పటిదాకా వుండి యిప్పుడే కమూ కాన్వెంట్ దగ్గర క్యూలో నించో డాని కెళ్ళాడు" అంది.

వైదేహి తెల్లబోయి సిగ్గుతో ముకుళించుకుపోయింది.

"కొత్తపెళ్ళి కూతురువి సరేగాని. రేషన్ కార్డుమీది పిచ్చి సంతకంలా నీ నుదుట ఉన్న చెదరిన బొట్టు నీ కథంతా చెప్పేస్తోంది" అంది రాధ.

సిగ్గుపట్టలేక గభాలున క్యూలో మునిగింది వైదేహి.

వంతలమంచి ముత్తయిదువులు. మొగవాళ్ళు క్యూలో జరిగి శుభ్రగాత్రులై ఎవరి తిట్లు వాళ్ళు తిడుతున్నారు. సువ్వాకాళ్ళు పీకేలా రోజంతా క్యూలో నుంచో తండ్రీ! మోయవలసిన సరుకు జేబుల నిండా ఉంది.

తెరుచుకుంటున్న పంచదార బస్తాలా లోకంలో నవ్వులు విన్పిస్తున్నాయి. పొద్దున్నే క్యూలో కుమ్ముకుంటున్న పిల్లలూ కార్డులు చిట్టి గుప్పెట్లతో పట్టి ఒకరికి ఒకరు విసురుకుంటూ ఉడకపోతను జయించి వీరుల్లా కిలకిలా పొంగి పొంగి నవ్వుకుంటున్నారు. వాళ్ళనిచూసి అప్పుడే వచ్చిన కార్డులు నవ్వుతున్నాయి.

ఆ పక్కింటి శ్రీదేవి కిరసనాయిలు డబ్బాదగ్గర కూర్చుని తనలో తనే మురిసిపోయి నవ్వుకుంటోంది. కాపురానికొచ్చి ఐదేళ్ళయినా కార్డు పడలేదు. అత్తమామల సాధింపులయ్యాయి. ఆడబిడ్డల ఈసడింపులయ్యాయి. నిన్ననే— నిన్ననే తెలిసింది తనకూ కార్డు రాబోతున్నట్టు అత్త మెచ్చుకుంది. ఆడబిడ్డ అలంకారాలు చేసింది. ఇక భర్త సరేసరి. శ్రీదేవి రాబోయే కార్డును తలచుకుంటూ ముసిముసిగా, తృప్తిగా నవ్వుకుంది.

ఫ్రీ మార్కెట్‌లో సరుకులు దొరికినట్టు ఆ వరండాలో అన్నదమ్ములూ, తోడికోడళ్ళూ ఒకటే నవ్వులు. ఆ రెండు కార్డులూ విడిపోయి రెండేళ్ళయింది. వాళ్ళ మధ్య మాటల్లేవు. పిలుపులంతకన్నా లేవు. ఒకే కార్డు పంచుకున్నవాళ్ళు బద్ధశత్రువులై పోయారు. అన్న యింట్లో శుభకార్యం యిద్దర్నీ కలిపింది. రెండేళ్ళ క్యూల గురించీ ఒక్క రోజులోనే చెప్పుకోవాలని కాబోలు — ఒకటే మాటలు. వాళ్ళ అయ్యకాలం జ్ఞాపకం తెచ్చుకున్నారు. కలిసిమెలిసి ఒకళ్ళ కోటా ఒకళ్ళు అందుకున్నట్టు వరస నవ్వులు.

లక్ష్మి సంక్రాంతికి గొబ్బెమ్మలు పెడుతూ పాట ఆఖరి చరణంగా "పంచదారా తెచ్చేటి పెనిమిటి నివ్వావే" అనంగానే ఫ్రెండ్స్ చెప్పకుండా సివిల్ సప్లయిస్‌లో పన్జేసే వాళ్ళ బావని తీసికొచ్చి అక్కడ నించోబెడితే లక్ష్మి పళ్ళెం అక్కడే వొదిలేసి పారిపోయింది చెంగున గెంతి.

ఆ నవ్వులు నీవు విన్నవే.
ఈ క్యూలు నీవు కన్నవే.

ఆ రెంటినీ తెలిపి మా తంటాలు నీకు చెప్పాలనే వచ్చానయ్యా!

రా తండ్రీ! రా!
రోజంతా క్యూలో నించో!
నించుని
పోయించు నరుడా!
తూయించు హరుడా!
హరహర మహాదేవ!
నరహర మహాదేవ!

ఎ. వి. మంగపతిరావు